క్లుప్తంగా

మహిళలు శక్తివంతులు కావాలి



మాట్లాడుతున్న ఐకేపీ కో–ఆర్డినేటర్ రవి

పుంగనూరు: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించి, శక్తివంతులుగా మారి సమాజాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని మండల ఐకేపీ కో–ఆర్డినేటర్ రవి పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్త్రీశక్తి భవన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ముగ్గులు, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సన్మానించారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కల్లూరు లయన్స్ క్లబ్ జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వీఆర్ఆర్ కళాశాలలోని అధ్యాపకురాళ్లను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల సామగ్రి పంపిణీ



మరుగుదొడ్ల సామగ్రి పంపిణీ చేస్తున్న మల్లప్ప

కుప్పంరూరల్: మండలంలోని మోట్లచేనులో నూతన మరుగుదొడ్ల నిర్మాణ పనులకు సంబంధించి మరుగుదొడ్డి డోర్, బేసిన్లను పంచాయతీ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ జి.మల్లప్ప లబ్ధిదారులకు అందజేశారు. 15 మందికి ఈ సామగ్రిని ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. త్వరలో ఒక్కో లబ్దిదారునికి రూ.10వేల చొప్పున రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏజీపీగా క్రిష్ణమూర్తి



పలమనేరు: పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ (ప్రభుత్వ సహ న్యాయవాది)గా మండలంలోని జల్లిపేటకు చెందిన క్రిష్ణమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈయన 17 ఏళ్లుగా స్థానిక కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఏజీపీగా నియమితులైన ఆయన్ను పలువురు న్యాయవాదులు అభినందించారు.

భక్తులకు రక్షణ కల్పించాలి

రొంపిచెర్ల: ఆలయానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాలని కల్లూరు సీఐ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఆలయానికి దూరంగా వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు.

పంచలోహ విగ్రహాలు సమర్పణ



రొంపిచెర్ల: రొంపిచెర్ల కట్ట కింద శివాలయానికి శివపార్వతుల పంచలోహ విగ్రహాలను శ్రీనివాసకుమార్, శ్రీవల్లి శుక్రవారం సమర్పించారు. బజారువీధి నుంచి విగ్రహాలను ఊరేగింపుగా శివాలయానికి తీసుకువచ్చారు. అక్కడ అర్చకులు మునిరాజశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ప్రతిష్ఠించారు. దాతలు ప్రతి ఏటా విగ్రహాలను సమర్పిస్తున్నారని ఆలయ చైర్మన్ వెంకటరమణ అభినందించారు. అలాగే ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇక, శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం సిద్ధపూజ, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

సమ్మోహనం..'శివలీలల' నృత్యం



కూచిపూడి నృత్యం చేస్తున్న డాక్టర్ రజని

పలమనేరు: శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్థానిక గంటావూరు పిరమిడ్ సెంటర్‌లో శివలీలలపై శుక్రవారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. గురు డాక్టర్ రజని ఆధ్వర్యంలో కళాకారులు శివలీలలను కూచిపూడి నృత్య ప్రదర్శనతో చాటారు.



శివలీలలు ప్రదర్శనలో కళాకారులు

వాటర్‌గ్రిడ్‌తో ఇంటింటికీ తాగునీరు

- మూడు దశాబ్దాల్లో చేయని అభివృద్ధిని ఐదేళ్లలో చేశాం
- ఎంపీ మిథున్‌రెడ్డి



జెడ్పీ అతిథి గృహంలో మొక్కలు నాటుతున్న ఎంపీ



భూ పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప

పుంగనూరు: నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు వైఎస్సార్ జిల్లా గండికోట వాటర్ గ్రిడ్ నుంచి పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీటిని తీసుకొచ్చి ఇంటింటికీ కొళాయిలతో నీళ్లిచ్చే కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్పతో కలసి పట్టణంలో జెడ్పీ అతిథి గృహాన్ని ప్రారంభించారు. అలాగే 1200 మంది మహిళలకు డీకేటీ భూముల పట్టాలను పంపిణీ చేశారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఐదేళ్లలో అభివృద్ధి

ఎంపీ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా ఇక్కడ అధికారం చెలాయించిన వారు అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లలో వేలాది కోట్ల రూపాయలు విడుదల చేయడంతో ఊహించని స్థాయిలో అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. పట్టణానికి బైపాస్ రోడ్డు, ఎంబీటీ రోడ్డు విస్తరణ, గ్రామాలకు రోడ్లతో కనెక్టివిటీ, కాలువలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లు నిర్మించామన్నారు. పట్టణంలో 100 పడకల ఆసుపత్రిని, ప్రజల ఆహ్లాదం కోసం మూడు పార్కులను ఏర్పాటు చేశామన్నారు. అలాగే సాగునీటి కోసం నేతిగుట్లపల్లె రిజర్వాయర్‌ను నిర్మించామన్నారు. నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ పాఠశాలలో తలదన్నేరీతిలో స్కూళ్లను తీర్చిదిద్ది, విద్యారంగాన్ని బలోపేతం చేశామన్నారు. హంద్రీ–నీవా కాలువలు విస్తరించి అన్ని చెరువులకు నీటిని తరలిస్తామన్నారు. పుంగనూరుకు అతి త్వరలోనే పెద్ద ఫ్యాక్టరీ రాబోతోందని, దీని ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని ఎంపీ పునరుద్ఘాటించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యా దవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

నివాళి

సదుం: మండల కేంద్రానికి చెందిన గనీసాహెబ్ భార్య రజాబీ (73) అస్వస్థతకు గురై మృతి చెందారు. ఆమె మృతదేహానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఎం.బాషా, ముబారక్, జవహర్, వాహీద్ పాల్గొన్నారు. అంతకుముందు ఎర్రాతివారిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి పిన్నమ్మ కృష్ణమ్మ మృతి చెందడంతో పాలు పోసే కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం'



రాళ్లగంగమాంబ ఆలయ ఆవరణలో కార్యకర్తలతో ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సన్నద్ధులు కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శ్రీ రాళ్ల గంగమాంబ ఆలయ ఆవరణంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల యుద్ధానికి అన్ని విధాలా సిద్ధమై ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించడమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ఇంటింటికీ చాటిచెప్పాలని సూచించారు. మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరాలన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వానికి ప్రజలను పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, కుప్పం నియోజకవర్గంలోనూ పార్టీ సత్తా చాటాలన్నారు. 40 రోజులు శ్రమిస్తే విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. కుప్పిగానిపల్లె సర్పంచ్ రామమూర్తి మాట్లాడుతూ, ఈనెల 11న 6 గ్రామ పంచాయతీలకు సంబంధించి వన్నెకుల క్షత్రియ కుల సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీలుగా ఏర్పడి ప్రతి గడపకూ ప్రచారం చేసే విధంగా చేస్తామన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్సీ దంపతులు

గుడుపల్లె: మహాశివ రాత్రి పురస్కరించుకుని ఎమ్మెల్సీ భరత్ దంపతులు మల్లప్పకొండపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితులు వారికి పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని ఎమ్మెల్సీ దంపతులు దర్శించుకుని అభిషేక పూజలు చేశారు. వారికి వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, కుప్పం మండల కన్వీనర్ మురుగేష్, సర్పంచ్ అమరనాథ్ పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్ దంపతులు

వివక్ష లేని సమాజం కోసం కృషి



వివిధ రంగాల్లో సేవలందిన వారిని సన్మానిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు

పలమనేరు: లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని, మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి మూలమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప అన్నారు. పలమనేరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక కళామందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఎక్కడైతే మహిళలను గౌరవిస్తారో అక్కడి సమాజం పవిత్రంగా ఉంటుందన్నారు.

మహిళలకు సన్మానం

అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రజని, డాక్టర్ మాధవి, డాక్టర్ సౌమ్య, ఏటి గీతాకుమారి, లక్ష్మీసుధా, మల్లెల జానకి, మాధవీదేవి, సరస్వతి, గాయత్రి దేవి, హేమశ్రీ, ప్రణమ్య, సుమ, వల్లి, సులోచన, గాయత్రి, భరణి, చిన్న సురేఖ, మాధవిలను ఉత్తమ మహిళా పురస్కారాలతో సన్మానించారు. సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, జేటీడీ నిర్వాహకులు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని గంగమ్మ గుడి కాంప్లెక్స్‌లో కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ నిర్వహించింది. మహిళా సభ్యులు జయంతి, రెహానా, ప్రసన్న, మేరి, సుజాత, సల్మా, నిరుపమ, ఖైరున్నీసా, హేమలత సన్మానించారు. జనార్దన్, మనోహర్, వరదరాజులు పాల్గొన్నారు.



ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కల్యాణం..కమనీయం



గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కళ్యాణ వేదికపై కొలువుదీర్చి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవమూర్తులపై తలంబ్రాలు కురిపించి మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో కళ్యాణోత్సవానికి హాజరయ్యారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, ఆలయ ప్రధానార్చకులు దేవరాజాచార్యులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణులుకండి



ప్యాడ్లు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో నరసింహులు తదితరులు

చౌడేపల్లె: పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహులు ఆశీర్వదించారు. శుక్రవారం ఎస్సీ బాలుర వసతి గృహంలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. చదువు ఒక్కటే కాదు..క్రమశిక్షణ, పట్టుదల, సాధించాలనే తపన ఉండాలన్నారు. అనంతరం చారాలకు చెందిన ఉత్తరాది హరిప్రసాద్, గీత దంపతులు టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను వితరణ చేశారు. వార్డెన్లు సురేష్, దీపారాణి, షరీఫ్, వాణీభాయ్, విజయభాస్కర్‌రెడ్డి, దళిత సంఘం నేతలు బ్యాంకు రెడ్డెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శంభో శంకరా!



మల్లప్ప కొండపై వెలసిన మల్లేశ్వరస్వామి...



పెద్దపంజాణి: జలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



సదుం: ఈరుణాచలేశ్వరస్వామికి అలంకరణ

పుంగనూరు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వర స్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మండలంలో నెక్కుందిలోని అగస్త్యేశ్వరాలయం, భీమగానిపల్లె భీమేశ్వరాలయం, రాగానిపల్లె రోడ్డులోని పరమేశ్వరస్వామి ఆలయం, యాబైరాళ్ల మొరవ వద్ద ఉన్న శివాలయం, పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మకు అర్ధనారీశ్వరి అలంకారంలో పూజలు చేశారు. భక్తులు పరమేశ్వరునికి నేతిదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. పండితులు ఆలయాలలో హోమాలు చేశారు.

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, పుదిపట్లలోని పంచలింగేశ్వర స్వామి, యర్రపల్లె వద్ద బసవేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. అర్చకులుస్వామివారి ఉత్సవమూర్తి, శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేసి, రుద్రాభిషేకం, అర్చనలు,అభిషేకాలు చేశారు. అలాగే పంచలింగేశ్వరస్వామి ఆలయంలోని పంచలింగాలకు, యర్రప్పల్లెలోని స్వయంభు బసవేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తిని నందివాహనంపై ఊరేగించారు. భక్తులు ఉపవాస దీక్షలతో ఆలయం చుట్టూ 108 సార్లు ప్రదక్షిణలు చేశారు.

సదుం: మండలంలో ఎర్రాతివారిపల్లె నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కన్నెమూల గణపతి ఆలయంలో శివపార్వతులకు కల్యాణోత్సవం నిర్వహించారు. జాంద్రపేట అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు చేశారు. సదుం మరకతేశ్వరస్వామి, నడిగడ్డ మల్లీశ్వరస్వామి, పుట్టావారిపల్లె మల్లికార్జునస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాత్రి జాగరణ భక్తుల కోసం పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు సీతమ్మ గుట్ట తిరునాళ్ల

మండలంలోని సీతమ్మగుట్టపై శనివారం తిరునాళ్ల నిర్వహించనున్నారు. శివరాత్రి మరుసటి రోజు తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ.

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని శివాలయాల్లో ఉదయాన్నే పాలాభిషేకం చేశారు. కొమ్మిరెడ్డిగారిపల్లె కొండపై ఉన్న మల్లీశ్వరస్వామి, కల్లూరులోని చంద్రమౌళేశ్వరస్వామి, జాంద్రపేటలోని మల్లేశ్వరస్వామి, దేవళంపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పలమనేరు: పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం భక్తుల శివనామ స్మరణతో హోరెత్తింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆ తర్వాత లింగోద్భవ అభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయం వద్ద పండరి భజనలు, శివకోటి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రూరల్ మండలం కూర్మాయిలోని మహాలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు,అభిషేకాలు చేశారు. భక్తుల అన్నవితరణ చేశారు. తొప్పనపల్లెలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్ల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మొరం రమేష్ ఏర్పాటు చేసిన శివకోటి అలరించింది. తొప్పనపల్లెలో శివలింగాన్ని అభిషేకిస్తున్నట్టు మొరం గ్రామానికి చెందిన గ్రామీణ సైంటిస్ట్ పవన్ ఆటోమేటిక్‌గా నీళ్లు పడేలా ఏర్పాటు చేయడం భక్తులను ఆకట్టుకుంది. ఇక, పెంగరగుంట క్రాస్‌లో యోగశివుని విగ్రహానికి విశేష పూజలు, కళ్యాణోత్సవం, జగమర్ల అడవిలోని పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు, పట్టణంలోని మహాప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో శివుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండిపేట కోటూరు శివాలయంలో కరిడిమొడుగు సర్పంచ్ హంసవేణి అన్నదానం చేశారు.

బైరెడ్డిపల్లె: చీలంపల్లెలోని కపిలేశ్వరస్వామి, నాగిరెడ్డిపల్లెలోని శ్రీసోమేశ్వరస్వామి, పాతపేటలోని శ్రీ మల్లికార్జునస్వామి, బైరెడ్డిపల్లెలోని శివపార్వతుల ఆలయం, కైగల్ జలపాతంలోని శ్రీజలకంఠేశ్వరస్వామి, కార్వేటికొండపై కాళభైరవేశ్వర స్వామి ఆలయాల్లో అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు.

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లె యోగనందీశ్వరస్వామి, కోగిలేరు జలకంఠేశ్వరస్వామి, రాయలపేట బసవేశ్వరస్వామి, బొమ్మరాజుపల్లె కాలభైరవేశ్వరస్వామి ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

వి.కోట: పట్టణంలో, దాసార్లపల్లెలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు,అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలో సాయంత్రం స్వామి వారిని వాహనంపై కొలువుదీర్చి మంగళవాయిద్యా లు, బాణసంచా మోత నడుమ ఊరేగించారు. రాత్రి ఆలయం వద్ద హరికథాగానం, భజనలు చేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

కోటి లింగేశ్వరక్షేత్రం.. భక్తుల పరవశం

కర్ణాటక, ఆంధ్ర కూడలిలోని కమ్మసంద్రంలో ఉన్న కోటిలింగేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడ పెద్దసంఖ్యలో ఉన్న శివలింగాల 108 అడుగుల భారీ శివలింగాన్ని ప్రతిష్ఠించారు. భారీ శివలింగానికి అభిముఖంగా 36 అడుగుల భారీ నంది విగ్రహం ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తాయి. మూడు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు తమ మొక్కులు చెల్లించారు.

గుడుపల్లె: మండలంలోని మల్లప్పకొండపై ఉన్న శ్రీ మల్లేశ్వరస్వామి, గుడివంక గంగాదరేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి,కాడేపల్లె నాగదేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటిపల్లె గ్రామంలో వీరభద్ర స్వామి ఉత్సవాలను గ్రామాలలో ఊరేగించి పూజలు చేశారు. గ్రామాలలో మహా శివరాత్రిని భక్తులు ఇండ్లలో శివపార్వతుల చిత్ర పటాలకు పూజలు చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా రాత్రి భక్తులు జాగారాలు ఉండి భజనలు చేశారు.




పలమనేరు: తొప్పనపల్లెలో..



పుంగనూరు: అర్ధనారీశ్వరి అలంకారంలో ..



పుంగనూరు: భోగనంజుదేశ్వరస్వామి..



పలమనేరు: పెంగరగుంట క్రాస్‌లో..



పులిచెర్ల: దేవళంపేటలో కాశీవిశ్వేశ్వరస్వామి



చౌడేపల్లె: శివాలయంలో..



పెద్దపంజాణి: జలకంఠేశ్వరస్వామి ఆలయంలో..



వి.కోట: అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి



పెద్దపంజాణి: యోగనందీశ్వరస్వామి



చౌడేపల్లె: పుదిపట్లలో పంచలింగేశ్వరస్వామి